క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వర్మ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వర్మతో పీడీ పద్మావతి

గణపవరం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎం అఖిల్ శ్రీవర్మ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్ 14 వాలీబాల్ పోటీలలో పాల్గొన్న వర్మ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ పద్మావతి తెలిపారు. వర్మను, శిక్షణ ఇచ్చిన పద్మావతిని హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ షాపుల తనిఖీ



రేషన్ షాపులో సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలో కొవ్వలి సీతంపేట గ్రామాల్లో రేషన్ షాపులను తహసీల్దార్ బి.సుమతి గురువారం తనిఖీ చేశారు. ప్రస్తుతం ఉన్న సరుకులు రిజిస్టర్‌తో పోల్చి చూశారు. రేషన్ షాపుల నిర్వహణ సమయాన్ని బోర్డులపై ఉంచాలని డీలర్లను ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని అన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ హేమమాలిని, వీఆర్‌ఓ కిషోర్ ఉన్నారు.

ఎద్దుల అక్రమ రవాణా నిందితుల పట్టివేత



సూరప్పగూడెం వద్ద కంటైనర్ వాహనంలో ఎద్దులను తరలిస్తున్న దృశ్యం

భీమడోలు: జాతీయ రహదారి సూరప్పగూడెం బస్టాండ్ వద్ద ఎద్దులను అక్రమంగా రవాణా చేస్తున్న కేరళకు చెందిన నలుగురు వ్యక్తుల ముఠాను గురువారం రాత్రి ఎస్సై వై.సుధాకర్ పట్టుకున్నారు. ఒరిసా నుంచి తమిళనాడులోని సెలంకు 40 ఎద్దులను కంటైనర్‌లో తరలిస్తుండగా సీజ్ చేశారు. ఎద్దులను పెదపాడులోని గో సంరక్షణ సమితికి తరలించారు. కేరళకు చెందిన జీజో సీజే, షానీమూన్ ఓమ్, రాబిన్ ఎంబీ, జాబీర్ సీఎస్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

హైస్కూల్లో మాక్ ఎలక్షన్



మాక్ ఎలక్షన్ పాల్గొన్న విద్యార్థులు

ఉంగుటూరు: చైతన్య వంతులైన భావి పౌరులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో మండలంలోని కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దేశ్ అప్నాయేన్ సహయోగ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో యాక్టిజెన్ క్లబ్‌నకు మాక్ ఎలక్షన్ నిర్వహించారు. యాక్టిజెన్ క్లబ్ ప్రెసిడెంట్‌గా కొడుదుల వర్షిత, వైస్ ప్రెసిడెంట్‌గా లింగంపల్లి అర్పిత ఎన్నికైనట్టు ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఉపాధ్యాయులు పీవీ కన్నారావు, జి.గవరయ్య, కె.గంగా మహాలక్ష్మి పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి సహకరించాలి

ఏలూరు (టూటౌన్): స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మాలజాతి మల్టీపర్పస్ భవన నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరించాలని కోరుతూ వివిధ సంఘాల మాలజాతి నాయకులు గురువారం ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తమ భవన నిర్మాణానికి ప్రొసీడింగ్స్ ఇవ్వగా మున్సిపల్ కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనులు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి సంజీవ్ కుమార్, నేతల రమేష్, మెండెం సంతోష్ కుమార్, దాసరి ఆంజనేయులు, పాము శామ్యూల్, పల్లెం ప్రసాద్, దాసరి రమేష్, మెండెం ఆనంద్ ఉన్నారు.

నేడు గ్యారవీ షరీఫ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ ముష్కిల్ కుష ఆస్థాన (గొలుసుల పంజా)లో శుక్రవారం గ్యారవీ షరీఫ్ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్టు గొలుసుల పంజా వంశ పారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలీ, ఎండీ గాలబ్ అలీ, ఎండీ మౌలా అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవంలో భాగంగా సాయంత్రం జండా ఊరేగింపు, అనంతరం దరూత్ సలాం, ఫాతెహాఖానీ, దువా ప్రార్థనలు నిర్వహిస్తామని వివరించారు. రాత్రి 7 గంటలకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

ఊరించి.. ఉసూరుమనిపించి

- కానరాని రూ.99కే చీప్ లిక్కర్ మద్యం
- పాత బ్రాండ్‌లతోనే అమ్మకాలు
- రూ.130, రూ.150 బ్రాండ్లు ప్లాస్టిక్ సీసాలే
- కూటమి సర్కారుపై మద్యం ప్రియుల మండిపాటు
- ప్రారంభమైన 21 మద్యం దుకాణాలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న మద్యం బాటిళ్లు



పెదనింద్రకొలనులో పీహెచ్‌సీ ఎదురుగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

నిడమర్రు: కొత్త మద్యం పాలసీతో నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరలకే అందిస్తామంటూ ఊరించిన సీఎం చంద్రబాబు ఆదిలోనే మద్యం ప్రియులను ఉసూరు మనిపించారు. ఉంగుటూరు నియోజకవర్గంలో మొత్తం 21 ప్రైవేట్ మద్యం దుకాణాలకు తొలిరోజు 12 షాపులు తెరుచుకోగా, గురువారం 21 దుకాణాల్లో మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ధరలు తగ్గించి నాణ్యమైన మద్యం ఇస్తామని చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల ముందునుంచి పదేపదే చెప్పడంతో మద్యం ప్రియులు ఉదయం 10 గంటల నుంచే మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. తీరా షాపులోని బ్రాండ్లను చూసి అసంతృప్తి చెందారు. కొత్త బ్రాండ్లు లేవని, అన్నీ పాతవే ఉన్నాయని వాపోయారు. రూ.99కే నాణ్యమైన చీప్ లిక్కర్ మద్యం కూడా అందుబాటులోకి తీసుకురాకపోడంతో మండిపడుతున్నారు. కొందరు సీఎం చంద్రబాబును బహిరంగంగానే తిట్ల దండకం అందుకున్నారు. ధరలు ఎక్కడ తగ్గించావ్, నాణ్యమైన మద్యం అంటే ఇదేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమ్మకు వందనం పాయే.. నాన్నకు ఇంధనం వచ్చే

1 నుంచి 10వ తరగతి వరకు గత ప్రభుత్వంలో ప్రభుత్వ/ప్రైవేటు బడుల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతి తల్లికీ ప్రోత్సాహకంగా అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ.14 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో వేశారు. ఆ పథకాన్ని అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఇద్దరు లేదా ముగ్గురు లేదా ఎంతమంది చదువుతున్నా.. వారందరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున తల్లులఖాతాల్లో వేస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ఆ హామీ గాలికి వదివేశారు. నేడు నాన్నకు ఇంధనం (ప్రైవేటు మద్యం) ఇచ్చేందుకు సిద్ధమయ్యారంటూ పలు కార్టులు, విమర్శలు వాట్సాప్‌లో చక్కర్లు కొడుతున్నాయి.

ఒకరిద్దరు మినహా వ్యాపారులంతా కొత్తవారే

నియోజకవర్గంలోని ఒకటి, రెండు మద్యం షాపులు మినహా మిగిలిన వారంతా కొత్తవారికే లక్కీడ్రాలో లైసెన్స్‌లు దక్కాయి. వీరిలో ఆక్వా వ్యాపార రంగంలో ఉన్నవారే ఎక్కువ మంది. మండలం యూనిట్‌గా మద్యం దుకాణాలు పెట్టుకునే అవకాశం ఉండటంతో ఎక్కువ సేల్స్‌ఉన్న గ్రామాల్లో స్థానిక కూటమి నేతల అండ ఉన్న లైసెన్స్‌దారులు పాత దుకాణాలే లీజుకు తీసుకున్నారు. నిడమర్రు మండలంలో మేజర్ గ్రామాలైన బువ్వనపల్లి, పెదనింద్రకొలను, నిడమర్రులో అమ్మకాలు ప్రారంభించారు. ఎక్కువ శాతం కొత్తవారవ్వడంతో తొలిరోజు 50 శాతం మంది షాపులు ఎక్కడపెట్టాలో, సరుకు కోసం ఏవిధంగా డీడీ తియ్యాలో తెలియక అధికారుల చుట్టూ తిరిగారు. ఒకేసారి గొడౌన్ నుంచి అన్ని షాపులకు మద్యం సరఫరా చేసే విషయంలో సిబ్బంది ఇబ్బందిపడ్డారు. ఈ నేపథ్యంలో తొలి రోజు మండలానికి ఒక్క షాపు మాత్రమే ఉండటంతోపాటు ముహూర్తాలు, పూజలతో సాయంత్రం 4 గంటల నుంచి అమ్మకాలు పారంభించారు. దీంతో మద్యం ప్రియులు ఆయా దుకాణాల వద్ద ఒకేసారి పోటెత్తారు. నిబంధనలు అతిక్రమించి రాత్రి 1 గంట వరకు అమ్మకాలు సాగినట్టు తెలిసింది. ఇప్పటికే ప్రతి షాపుకు సమీపంలో రోజంగా మద్యం అమ్మేందుకు నైట్ పాయింట్స్ వెలిసినట్టు చెబుతున్నారు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాల దక్కించుకోవడానికి సిండికేట్ సభ్యుల చుట్టూ కూటమిలోని ప్రజా ప్రతినిధులు సైతం క్యూకట్టడం విశేషం.

కోట్లు దండుకున్న సర్కారు

ఉంగుటూరు నియోజకవర్గంలో 21 దుకాణాలకు 1035 దరఖాస్తులు వచ్చాయి. వ్యాపారం ప్రారంభించకుండానే దరఖాస్తుకు రూ.2 లక్షలు చొప్పున నాన్ రిఫండ్‌బుల్ డిపాజిట్ కింద రూ.20.7 కోట్లు ప్రభుత్వం దండుకొంది. గణపవరం, ఉంగుటూరు, నారాయణపురం మండలాల్లోని 18 షాపుల నిర్వాహకులు ఒక్కో షాపుకు రూ.65 లక్షలు చెల్లించాలి. నిడమర్రు మండలంలోని 3 షాపులకు ఒక్కోషాపుకు రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే మొత్తం ఏడాదికి రూ.కోట్లు వీరి నుంచి ప్రభుత్వం వసూలు చేయనుంది. ఇంత భారీ మొత్తంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి రావడంతోపాటు, ఇప్పటికే సిండికేట్‌గా లక్కీడ్రా కోసం ఒక్కో సిండికేట్ సభ్యుడు రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లు వరకు ఖర్చు చేశారు. ఈ మొత్తాన్ని లాక్కోవాలంటే అడ్డదార్లు తొక్కక తప్పదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో మద్యం ఏరులై పారనుందని తెలుస్తోంది.

కూటమి పాలనలో దళితులపై దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: కూటమి పార్టీలు అధికారం చేపట్టిన నాటి నుంచి దళితులపై దాడులు జరుగుతున్నాయని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ చీకటిమిల్లి మంగరాజు ఆరోపించారు. గణపవరం మండలం పిప్పరలో నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత, దళిత, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని బలవంతంగా తొలగించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఇంతవరకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు పెరిగిపోయాయని, అయినా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు నోరు మెదపడంలేదని విమర్శించారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు సోడదాసి జైపాల్, బేతాళ శరత్, తుమ్మల ఫ్రాన్సిస్, మందా విజయ్‌ప్రసాద్, కొండల రావు పాల్గొన్నారు.

పెదపాడులో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండల కేంద్రమైన పెదపాడులో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, మండలంలో అన్ని గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు అందించాలని సీపీఎం పెదపాడు శాఖా మహాసభ డిమాండ్ చేసింది. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో నిర్వహించిన మహాసభలో పలు ప్రజా సమస్యలపై తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా పెదపాడు శాఖా కార్యదర్శిగా గుండపనేని సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి మందుల సరఫరా నిలుపుదల సిగ్గుచేటు

ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఆగ్రహం



అప్పన ప్రసాద్

దెందులూరు: దెందులూరు సీహెచ్‌సీకి నెల రోజులుగా 33 రకాల మందులు, సూదులు, ఇంజెక్షన్లు, ఐవీ క్యాన్స్, కాటన్, గ్లౌజులు సరఫరా చేయలేకపోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో కూటమి ప్రభుత్వం దెందులూరు సీహెచ్‌సీకి మందులు సరఫరా చేయకపోవడం పట్ల నల్లబ్యాడ్జీతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూ.2.75 కోట్లతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో దెందులూరు సీహెచ్‌సీని ఆధునికీకరించి, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే మందులు కూడా సరఫరా చేయలేక చేతులెత్తేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ఆరోపించారు. దెందులూరు సీహెచ్‌సీకి నాలుగు మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సుమారు వందకు పైగా రోగులు వస్తున్నారని తెలిపారు. వైద్యులందరూ అంకితభావంతో సేవలందిస్తున్నా, పరికరాలున్నా, టాబ్లెట్స్, ఇంజెక్షన్స్ లేకపోతే రోగులు వైద్యం ఎలా చేయించుకుంటారని ప్రశ్నించారు. 10 రోజుల్లో సీహెచ్‌సీకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 రకాల మందులు, టాబ్లెట్స్ రాకపోతే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని అప్పనప్రసాద్ వెల్లడించారు.

28 నుంచి రిలే దీక్షలు

దెందులూరు సీహెచ్‌సీకి కూటమి ప్రభుత్వం మందులు సరఫరా చేయకపోతే ఈ నెల 28 నుంచి రిలే నిరాహారదీక్ష చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, దెందులూరు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యుడు కట్టా ఏసుబాబు గురువారం అన్నారు.

కారణజన్ముడు వాల్మీకి మహర్షి



గణపవరం : వాల్మీకి జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి



భీమడోలు : వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న అధికారులు

గణపవరం: సమాజానికి రామాయణాన్ని అందించిన వాల్మీకి మహర్షి కారణజన్ముడని, ఆయన జీవితం విలక్షణమైందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం కాలేజీలో తెలుగువిభాగం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రామాయణ ఇతిహాసం మానవుడు రచించిన తొలి గ్రంథమని అన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ మధురాజు మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణాన్నే నేటికీ భారతీయులు ప్రామాణికంగా తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐక్యుఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, ఎస్ఎస్ఎస్‌పీవోలు జి.వెంకటరమణ, భాస్కరరావు, స్వరూపరాణి, బాలమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ఆదికవి వాల్మీకి

భీమడోలు: రామాయణాన్ని రాసి ధర్మస్థాపన గావించి శ్రీరాముడు లోకాంత పురుషుడిగా చాటిన ఆదికవి వాల్మీకి నేటి సాహిత్య లోకానికి ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు తహసీల్దార్, భీమడోలు శాఖా గ్రంథాలయం, పాతూరు ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ కిరణకుమారి, భీమడోలు లైబ్రరీలో సామాజిక కార్యకర్త, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోయవాడైన రత్నకరుడు జ్ఞానోదయం చెంది రామయణాన్ని రాసి, సాహిత్య లోకానికి ఆయన వేసిన అడుగులు నేటికి స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచి రామాయణం, ఇతిహాసాలను చదివి విజ్ఞానాన్ని, నైతిక విలువలను నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో హెచ్ఎం పి.నిర్మల కుమారి, కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రీసర్వే గ్రామ సభలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

నిడమర్రు: రీసర్వే గ్రామ సభల్లో అభ్యంతరాలు స్వీకరించి తగిన పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ ఎన్ నాగరాజు అన్నారు. రెవెన్యూ సిబ్బందికి గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ భూ రీసర్వే ప్రాజెక్టుకు సంబంధించి అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ఈనెల 18న ఉదయం 10 గంటలకు ఆముదాలపల్లి గ్రామ పంచాయతీ వద్ద, 19న ఉదయం 10 గంటలకు పెదనింద్రకొలను సచివాలయం-2 వద్ద గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన శాశ్వత భూ హక్కు - భూ రక్షణ పథకంలో జరిగిన రీసర్వేకు సంబంధించిన అభ్యంతరాలు ఉంటే ఈ సభల్లో అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. గత పథకం పేరును మార్చి ఏపీ రీసర్వే ప్రాజెక్ట్‌గా సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు, రైతులు ఈ సభలను వినియోగించుకోవాలని కోరారు.

భీమడోలు మండలంలో..

భీమడోలు: భూ రిసర్వే పూర్తయిన గ్రామాల్లో వ్యవసాయ భూముల్లోని సమస్యల పరిష్కారానికి ఈనెల 18వ తేదీ శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బి.రమాదేవి గురువారం తెలిపారు. ఈనెల 18న పోలసానిపల్లి, 19న దుద్దేపూడి, 22న కోడూరుపాడు గ్రామాల్లో ఉదయం 10 గంటలకు గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. రికార్డుల్లో మార్పులు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: మండలంలో ఈ నెల 18 నుంచి రీసర్వేపై గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. 18న మేధినరావుపాలెం, 19న తిమ్మన్నగూడెం, 22న ఖండ్రికనర్సింహపురం, 23న శ్రీరామవరం, 24న గుడిగుంట, 25న అక్కిరెడ్డిగూడెం, 26న సానిగూడెం, 29న గాలాయగూడెం, 30 కొత్తపల్లి, నవంబర్ 1న చల్లపల్లి, 2న ఉప్పుగూడెం, 5న కొమిరేపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రీసర్వేకు సంబంధించి సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలను కోరారు.

క్షయపై అవగాహన అవసరం



విద్యార్థులకు క్షయపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: విద్యార్థి దశ నుంచే క్షయవ్యాధితో పాటు వివిధ రోగాలు, వ్యాధులపైనా అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిలకంపాడు, కాశిపాడు గ్రామాలలో పాఠశాలల్లోని విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఇళ్లవద్ద, పరిసర ప్రాంతాల్లో క్షయ బాధితులు ఉంటే పీహెచ్‌సీ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. వారం రోజులకు మించి దగ్గు, కఫం పడటం, ఆకలి లేకపోవడం, బరువుతగ్గడం, ఛాతిలో నొప్పి, నోటి నుంచి రక్తం చారలు పడటం, సాయంత్రం జ్వరం రావడం, వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలని వివరించారు. పీహెచ్‌సీలో ఉచితంగా క్షయ పరీక్షలు చేస్తామని, వ్యాధి నిర్ధారణ జరిగితే ఆరు నెలలపాటు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

భీమడోలు: నిరుద్యోగ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంబన సాధించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ అన్నారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల మండల శాఖ ఆధ్వర్యంలో బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహితుల అభివృద్ధి సంస్థ (హైదరాబాద్) ఆర్థిక సహకారంతో 37 రోజుల పాటు 100 మంది మహిళ, యువతకు చేపట్టిన మగ్గం, జర్దోసి శిక్షణ తరగతులను గురువారం భీమడోలు అమ్మవార్ల ప్రాంగణం వద్ద బైరెడ్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. కార్యక్రమానికి స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రోగ్రామ్ ఇన్‌చార్జి కె.నాగప్రసాద్ అధ్యక్షత వహించారు. డైరెక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు మగ్గం, జర్దోసిలకు ఎంతో డిమాండ్ ఉందని, శిక్షణలో మెలకువలను నేర్చుకుని రాణించాలన్నారు. శిక్షణ తర్వాత బ్యాంకర్ల నుంచి రుణాలు పొంది సొంతంగా యూనిట్ల స్థాపన చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. తొలుత సత్యసాయి చిత్రపటం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ శ్యాంప్రసాద్, గ్రామకార్యదర్శి కేవీఎల్ తనూజ, కన్వీనర్ వర్ధినీడి సత్యసా యి, బ్యాంకు మేనేజర్లు శివకృష్ణ, రమేష్, జిల్లా, సమితి పదాధికారులు, సేవాదళ్, భక్తులు పాల్గొన్నారు.

కళ్లకు గంతల తొలగింపు చరిత్రాత్మక ఘట్టం

దెందులూరు: న్యాయదేవతకు కళ్లగంతల తొలగింపు చరిత్రాత్మక ఘట్టమని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు ముకుంద, ఆంధ్ర మధుబాబు, చిలకా హరీష్, సరిపల్లి మహేష్, గొలిమే హరిబాబు, భీమడోలు రామకృష్ణ, ఉంద్రాజవరపు నాగు అన్నారు. గురువారం ఖండ్రికనర్సింహపురంలో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఒక చేతిలో ఖడ్గం స్థానంలో రాజ్యాంగ ప్రతిమ ఏర్పాటు చేయడంతో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ న్యాయ వ్యవస్థ పరిరక్షణకు చిరకాలం గుర్తుంటారని తెలిపారు. భారతీయ న్యాయవ్యవస్థ చిహ్నానికి కొత్త రూపు తీసుకురావడమే లక్ష్యంగా చట్టం గుడ్డిది కాదని సుప్రీంకోర్టు స్పష్టమైన సందేశం ఇచ్చినట్లైందని చెప్పారు. అందరికీ సమానత్వం అందించే రాజ్యాంగాన్ని ఒక చేతిలో ఏర్పాటు చేయడం ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను గౌరవించడమేనని, ఇది భారతీయులందరికీ సంతోషించదగ్గ పరిణామమని అన్నారు.

రహదారిపై గోతులతో అవస్థలు



భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వద్ద గోతుల్లో వెళుతున్న వాహనాలు

భీమడోలు: భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న భారీ గుంతలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. భీమడోలు రైల్వే గేటు నుంచి ద్వారకాతిరుమలకు వెళ్లే ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రహదారిపై అడుగుకో గొయ్యి ఏర్పడడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గోతుల వద్ద ఓ దుకాణదారుడు కూలర్ రేకును ప్రమాద చిహ్నంగా ఉంచారు. అధికారులు ప్రమాదకరంగా ఉన్న గోతుల వద్ద ఎటువంటి హెచ్చరిక జెండాను పెట్టిన పాపాన పోలేదని వాహనదారులు, భక్తులు విమర్శిస్తున్నారు. గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

ప్రత్యేక శిక్షణతో అభ్యసన లోపాల నివారణ



ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉంగుటూరు: చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో ఉండే అభ్యసన లోపాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్ద వచ్చని దివ్యాంగుల ప్రత్యేక ఉపాధ్యాయురాలు పి.భాగ్యలక్ష్మి అన్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్లెక్సియా అవేర్నెస్ మంత్ సందర్భంగా డిస్లెక్సియా అవగాహన సదస్సు నిర్వహించారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికి తీసి ప్రత్యేక విధి విధానాలను అనుసరిస్తూ బోధన సాగించడం ద్వారా వారిని ఉన్నత వ్యక్తిగా తీర్చి దిద్దవచ్చని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు షేక్ నాగూర్ మీరా సాహెబ్ మాట్లాడుతూ డిస్లెక్సియా / అభ్యసన లోపాలు గల పిల్లలలో పురోభివృద్ధి సాధించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం డిస్లెక్సియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

భీమడోలు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సూరప్పగూడెం, చెట్టున్నపాడు, ఆగడాలలంక, లక్ష్మీపురం, కొరుకొల్లు, గుండుగొలను గ్రామాల్లో గురువారం రూ.1.77 కోట్ల విలువ చేసే సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి, మాజీ ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.